# రాష్ట్రంలో లక్ష బెల్ట్‌షాపులు!

- ప్రతి గ్రామంలో 10 చొప్పున మద్యం దుకాణాలు
- అదనంగా 200 కోట్ల మద్యం అమ్మకాలు
- పండగైనా, పబ్బమైనా బెల్ట్‌షాపులే కీలకం
- కాంగ్రెస్ పాలనలో కరువైన నియంత్రణ
- అసలే పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు
- బెల్ట్‌షాపులు ఎత్తేస్తామన్న హామీ తూచ్!

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ): తెలంగాణ పల్లెలు, పట్టణాల్లోని ఏ గల్లీ చూసినా, ఏ వాడకు వెళ్లినా బెల్ట్‌షాపుల జాడలు కనిపిస్తున్నాయి. ఊళ్లల్లో ఏ బస్టాండ్ పక్కన చూసినా, ఏ వాడలోని కిరాణా దుకాణంలోకి తొంగిచూసినా మద్యం అక్రమ అమ్మకాలు బహిరంగంగా కొనసాగుతున్నాయి. మేము అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే బెల్ట్‌షాపుల తాట తీయిస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ నేతలు హామీ ఇచ్చారు. ఆ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది దాటింది. ఇప్పుడు రాష్ట్రమంతా లక్షకు పైగా బెల్ట్‌షాపుల ద్వారా మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మహిళలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అయినా పాలకులకు చీమకుట్టినట్టు కూడా లేదు. కాంగ్రెస్ అభయహస్తం హామీల్లో 401వ హామీ అయిన 'బెల్ట్‌షాపులు పూర్తిగా రద్దు' హామీ అటకెక్కింది. రాష్ట్రంలో 12 వేలకు పైగా ఉన్న పంచాయతీలుంటే 1,000 మందికి పైగా జనభా కలిగిన ప్రతీ పంచాయతీలోనూ కనీసం 7 నుంచి 10 వరకు బెల్ట్‌షాపులు దర్శనమిస్తున్నాయి. పట్టణాలు, నగరాల్లోని గల్లీల్లో 'మందుకొట్లు' దర్శనమిస్తున్నాయని మహిళలు గగ్గోలు పెడుతున్నారు. నిరుడు ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం పల్సి, కోసాయి గ్రామాల్లో బెల్ట్‌షాపులపై మహిళలు దాడులు చేశారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లోనూ ఇలాంటి పరిస్థితే కనిపిస్తున్నది. నమ్మి ఓటేస్తే నట్టేట ముంచారంటూ మహిళలు రగిలిపోతున్నారు.

**బెల్ట్‌షాపులపై సమీక్షించని సీఎం**

బెల్ట్‌షాపుల పనిపడతామని ఎన్నికల ముందు చెప్పిన రేవంత్‌రెడ్డి.. ముఖ్యమంత్రి అయ్యాక ఆ అంశంపై ఒక్కసారి కూడా సమీక్షే చేయలేదని పలువురు రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. 2023 డిసెంబర్‌లో ఎక్సైజ్ అధికారులతో నిర్వహించిన తొలి సమావేశంలోనే బెల్ట్‌షాపుల ప్రాధాన్యం తెలుసుకున్న సీఎం.. ఏడాది పూర్తయినా వాటి జోలికి వెళ్లకపోవడం వెనుక చాలా కారణాలు ఉన్నాయని అంటున్నారు. గత బడ్జెట్‌లో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ నుంచి మద్యం ఆదాయాన్ని అదనంగా మరో రూ.5,318 కోట్లకు పెంచాలని తీసుకున్న నిర్ణయం ప్రకారమే.. బెల్ట్‌షాపులపై ప్రభుత్వ పెద్దలు, ఎక్సైజ్ అధికారులు, పోలీసులు కన్నెత్తి చూడటం లేదని వారు తేల్చిచెప్తున్నారు.



| | |
|---|---|
| తేదీ | : 22 ఫిబ్రవరి 2023. |
| వేదిక | : వరంగల్ తూర్పు నియోజకవర్గంలో హాత్ సే హాత్ జోడో పాదయాత్ర కార్నర్ మీటింగ్‌లో టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. 'రాష్ట్రంలో 3,000 వైన్‌షాపులు, 60 వేల బెల్ట్ షాపులున్నాయి. మహిళలు తీవ్రంగా బాధపడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే 100 రోజుల్లో గ్రామాల్లో బెల్ట్‌షాపులు ఉంటే బట్టలూడదీసి కొట్టి, బొక్కలో వేయిస్తా' అంటూ వ్యాఖ్యలు చేశారు. |

| | |
|---|---|
| తేదీ | : 17 నవంబర్ 2023 |
| వేదిక | : హైదరాబాద్ గాంధీభవన్ అభయహస్తం పేరుతో కాంగ్రెస్ రూపొందించిన 42 పేజీల మ్యానిఫెస్టోను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విడుదల చేశారు. అందులో 62 ప్రధాన అంశాలను ప్రస్తావించింది. వాటిల్లో 100 రోజుల్లో చర్యలు తీసుకుంటామన్న హామీల్లో బెల్ట్‌షాపుల రద్దు ఒకటి. |

## బెల్ట్‌షాపులదే హవా

రాష్ట్రంలో బెల్ట్‌షాపుల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతుంది. ఏ పండగొచ్చినా, ఎలాంటి శుభకార్యాలు జరిగినా బెల్ట్‌షాపులదే హవా. సాయంత్రమైతే చాలు ఏ కిరాణా కొట్టు వద్ద చూసినా, బస్టాండ్ల సమీపంలోని కిల్లీ కొట్లుచూసినా నిత్యం 10 మంది మద్యం కోసం తచ్చాడుతూ ఉంటారు. గత డిసెంబర్ నెలాఖరున మునుపెన్నడూ లేనంతగా రూ.200 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయని సాక్షాత్తూ ఎక్సైజ్ అధికారులే చెప్పారు. ఇదంతా బెల్ట్‌షాపుల మహత్యమేనని అందరికీ తెలిసిన విషయమే. ఎవరైనా యువత తమ ఊరిలో బెల్ట్‌షాపులను నిర్మూలించాలని కోరితే.. కొందరు ఎక్సైజ్ అధికారులు.. తమ డిక్షనరీలో బెల్ట్‌షాపు అనే పదమే లేదని బుకాయిస్తున్నారు. ఇటీవల జరిగిన ఎక్సైజ్ వార్షిక నివేదికలో మాత్రం 6,900 మంది బెల్ట్‌షాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకున్నామని చెప్పినా, తూతూ మంత్రంగానేనని తేలిపోయింది. బెల్ట్‌షాపులపై చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని పరోక్షంగా చెప్పారు.

## డిసెంబర్ 31న కండోమ్స్ ఆర్డర్ల జోరు

- న్యూయర్ వేడుకల్లో క్విక్ కామర్స్ వేదికలు అత్యధిక డెలివరీ

*హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ): డిసెంబర్ 31న దేశవ్యాప్తంగా న్యూ ఇయర్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆ రోజు స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, బ్లింకిట్, బిగ్ బాస్కెట్ వంటి క్విక్ కామర్స్ వేదికలు కస్టమర్లకు వేగంగా సేవలు అందించాయి. ఆ సేవలపై తాజాగా ఆసక్తికర డాటాను వెల్లడించాయి. వినియోగదారులు ఎక్కువగా ద్రాక్షపండ్లు, కండోమ్స్ ఆర్డర్ చేశారని తెలిపాయి. ఆ రోజు సాయంత్రం 5:30 గంటల వరకే స్విగ్గీ ద్వారా 4,779, అర్ధరాత్రి వరకు 1.2 లక్షల కండోమ్ ప్యాకెట్లను డెలివరీ చేసినట్టు వెల్లడించింది. బ్లింకిట్ డెలివరీ బృందం సాయంత్రం 8 వరకు 2.3 లక్షల ఆలుబుజియా, 6,834 ఐస్‌క్యూబ్ ప్యాకెట్లను డెలివరీ చేసింది. బిగ్ బాస్కెట్ డెలివరీ చేసిన వాటిలో ఐస్‌క్యూబ్స్‌తో పాటు కార్డులు, పార్టీగేమ్స్, హోంబేకింగ్ ఐటమ్స్, సోడా, మాక్‌టైల్స్ ఉన్నాయి.*

# నిబంధనల ప్రకారమే పట్టాలు

మొదటిపేజీ తరువాయి...

అధికారులు వంత పాడుతున్నారన్న విమర్శలొస్తున్నాయి. కాంగ్రెస్ పెడుతున్న ఒత్తిళ్లకు, కేసులకు భయపడని బీఆర్ఎస్ నాయకులు.. న్యాయపరంగా తేల్చుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. తప్పు చేయనంతవరకు ఎవరికీ భయడాల్సిన అవసరం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన భరోసా మేరకు.. బీఆర్ఎస్ నాయకులు ముందుకు సాగుతున్న తీరు.. అధికార పార్టీ నాయకులకు మింగుడు పడటం లేదు. ఈ పరిస్థితుల్లో మరికొంతమంది బీఆర్ఎస్ నాయకులపై కేసులు పెట్టేందుకు ఫిర్యాదులు సిద్ధం చేయాలంటూ.. ఓ కాంగ్రెస్ నాయకుడు ఆదేశిస్తే.. ప్రస్తుతం అదే పనిలో అధికారులు నిమగ్నమైనట్టు తెలుస్తున్నది.

**నిబంధనల ప్రకారమే పట్టాలు**

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బొల్లి రామ్మోహన్‌పై తప్పుడు కేసు పెట్టిన విషయాన్ని ఆదివారం 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి తెచ్చింది. రామ్మోహన్ భూమికి సంబంధించిన క్రయ, విక్రయాలు అన్నీ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే జరిగాయి. అన్ని రకాల ఎన్‌వోసీలు వచ్చాయి. అయినా, తప్పుగా చూపి ఆయనపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపిన వ్యవహారం, అందులో అధికారుల పాత్ర, అధికార పార్టీ నాయకుల ఒత్తిడి వంటి విషయాలను 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి తెచ్చింది. ఇదే కోణంలో మరి కొంతమంది బీఆర్ఎస్ నాయకులపై కూడా కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. కేసులు నమోదైన వారిలో సురభి నవీన్‌రావు ఒకరు. నిజానికి 2004-05 నుంచి పహనీల్లో పేరు నవీన్‌రావుకు పట్టాదారు పాసుపుస్తకాలున్నాయి. అయినా.. 20 ఏండ్ల నుంచి రికార్డుల్లో ఉన్నా.. అవి తప్పుగా నమోదయ్యాయని పేర్కొంటూ తాజాగా, ఫిర్యాదు చేసి అరెస్టు చేయించారు. బీఆర్ఎస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి సోదరుడు జిందం దేవదాసుపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు పంపారు. జిందం చక్రపాణిని రాజకీయంగా అణగదొక్కాలన్న దురుద్దేశంతో అతని సోదరుడు జిందం దేవదాసును కేసులో ఇరికించారనే విమర్శలొస్తున్నాయి. ఇప్పటికే కొంతమందిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపగా.. వారంతా బెయిల్‌పై వచ్చారు. వీరంతా అధికార పార్టీ ఒత్తిళ్లకు లొంగకుండా, న్యాయపరంగా పోరాటం చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో తాము అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదని భావించిన అధికార పార్టీకి చెందిన ఒక నాయకుడు.. మళ్లీ అధికారులపై ఒత్తిడి పెట్టినట్టు తెలుస్తున్నది. ఆయన ఆదేశాల మేరకు కొంతమంది అధికారులు మరికొంతమంది బీఆర్ఎస్ నాయకులపై కేసులు పెట్టేందుకు నివేదికలు సిద్ధం చేస్తున్నారని సమాచారం. దశాబ్దాలుగా రికార్డుల్లో పేర్లు ఉండగా.. అవి తప్పుగా నమోదు చేసుకున్నారంటూ పెడుతున్న కేసులను నిశితంగా పరిశీలిస్తే.. అంతా రాజకీయ కక్ష ఉన్నట్టు అర్థమవుతున్నది. ఇందుకు నిదర్శనం.. సురభి నవీన్‌రావుతోపాటు జిందం దేవదాసు కేసులే.

**20 ఏండ్ల రికార్డులు తప్పట!**

ఇతని పేరు.. సురభి నవీన్‌రావు. తంగళ్లపల్లి మండలం తాడూరు గ్రామ శివారులోని సర్వే నంబర్ 1148/8 ఈఈలో నవీన్‌రావు పేరుపై మూడు ఎకరాల స్థలం ఉన్నది. 2004-05 సంవత్సరం నుంచి పహనీలో పట్టాదారుగా నమోదై నేటివరకు కొనసాగుతున్నాడు. భూ రికార్డుల ప్రక్షాళలో భాగంగా ఆయన చేసుకున్న దరఖాస్తు మేరకు.. దస్త్రాలు, రికార్డులు పరిశీలించి పట్టాదారు పాసు పుస్తకం జారీ చేశారు. డిజిటల్ సైన్ పూర్తి చేసి ధరణిలో నమోదు చేసిన అధికారులు.. అతని పేరుపై రికార్డులను అప్‌డేట్ చేశారు. దాదాపు 20 ఏండ్లుగా పహనీలో కొనసాగుతున్న నవీన్‌రావుపై ఇప్పుడు కేసు నమోదు చేశారు. ఇందుకు రకరకాల కారణాలను చూపించారు. 2004-05లో ఇతనికి అసైన్డ్‌భూమి ఎలా ఇచ్చారో తెలియడం లేదని, అందుకు సంబంధించిన రికార్డులు లభ్యంకావడం లేదని ప్రస్తుత తహసీల్దార్ నివేదిక ఇవ్వడంతోపాటు కేసు నమోదు చేయాలని పేర్కొంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ వ్యవహారంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ భూమికి సంబంధించి తహసీల్దార్‌కు ఎవరు ఫిర్యాదు చేశారో ఎక్కడా చెప్పలేదు. 20 ఏండ్ల క్రితం పహనీలో నమోదైన తదుపరి అనేక రికార్డులు మారుతూ.. చివరకు పట్టాదారు పుస్తకాలు కూడా జారీ అయ్యాయి. నిజానికి పహనీలో పేరు నమోదైన సమయంలో అంటే 2004-05లో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉన్నది. ప్రస్తుత తహసీల్దార్ చెప్తున్నట్టుగా ఇవి తప్పుడు రికార్డులే అయితే, ఆ వ్యవహారం మొత్తం కాంగ్రెస్ ప్రభుత్వంలో జరిగినట్టే కదా? కానీ, ఇదంతా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగినట్టుగా తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఇదే సర్వే నంబర్ 1148/5 ఏఏలో సురభి నవీన్‌రావు తండ్రి సురభి సుధాకర్‌రావు పేరుతో 5 ఎకరాల స్థలం ఉన్నది. తమ్ముడు సురేందర్‌రావు పేరుతో కూడా సర్వే నంబర్ 1148/13/ఈలో 3 ఎకరాల స్థలం ఉన్నది. వీరు కూడా పట్టాదారు పాస్‌పుస్తకం కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో సురభి సుధాకర్‌రావుకు పాసుబుక్‌ను అధికారులు జారీ చేయలేదు. సరైన రికార్డులు లేవని తిరస్కరించారు. కానీ, సురభి నవీన్‌రావు, సోదరుడు సురేందర్‌రావుకు రికార్డులను పరిశీలించిన అనంతరమే అధికారులు పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేశారు. అంతేకాదు, గత 20 ఏండ్లుగా సంబంధిత స్థలం వీరి పేరుపైనే కొనసాగుతున్నది.

**మరణించిన వ్యక్తిపై కేసు?**

నవీన్‌రావు తండ్రి సుధాకర్‌రావు నిరుడు మేలో చనిపోయారు. సుధాకర్‌రావు పేరుపై సర్వే నంబర్ 1148/5 ఏఏ లో ఐదెకరాల స్థలం ఉన్నది. అయితే, రికార్డుల స్టేటస్‌లో సంతకం చేయలేదని తహసీల్దార్ ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కానీ, సుధాకర్‌రావును ఈ కేసులో ఏ-1గా చేర్చుతూ కేసు నమోదు చేసినట్టు తెలుస్తున్నది. తహసీల్దార్ తాజాగా, ఇచ్చిన ఫిర్యాదులో సుధాకర్‌రావు మరణించిన విషయాన్ని పేర్కొనలేదు. చనిపోయిన వ్యక్తిపై కేసు నమోదు చేయాల్సిన అవసరం లేదు. అయన పేరుపై భూమి తప్పుగా నమోదు అయితే సదరు భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవచ్చు. కానీ, అటువంటి ఆదేశాలు ఇచ్చిన దాఖలాలు లేవు. తహసీల్దార్ ఇచ్చిన ఫిర్యాదు సమయానికే సుధాకర్‌రావు మరణించినప్పటికీ, ఆ విషయం ఫిర్యాదులో పేర్కొనకపోవడాన్ని చూస్తే.. అధికారులు ఆఘమేఘాల మీద ఎలా ఫిర్యాదులు చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## పీవోటి చట్టం ప్రకారం ఇచ్చారు



ఇతని పేరు జిందం దేవదాసు.. ఇతని పేరిట సారంపెల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 164/3లో మూడెకరాల స్థలం ఉన్నది. ఈ భూమిని కోల ఎల్లవ్వ నుంచి 2013లో కొనుగోలు చేశారు. దశాబ్దాలుగా కోల ఎల్లవ్వ పేరుతో ఈ స్థలం ఉన్నది. అమెకు పట్టాదారు పాసు పుస్తకం ఉన్నది. కోల ఎల్లవ్వ తన బిడ్డ పెండ్లి అవసరాల కోసం ఈ స్థలాన్ని విక్రయిస్తే, అమె రిక్వెస్ట్ మేరకు జిందం దేవదాసు కొనుగోలు చేశారు. అప్పటినుంచి ఆయనే మోఖాపై ఉన్నారు. భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా.. తన పేరును రికార్డుల్లోకి ఎక్కించాలని కోరుతూ దేవదాసు దరఖాస్తు చేసుకున్నారు. మోఖాపై పరిశీలించిన ఆనాటి రెవెన్యూ అధికారులు కోల ఎల్లవ్వ కుటుంబంతోపాటు చుట్టుపక్కల వారిని విచారించి.. అన్నీ సవ్యంగా ఉన్నాయని భావించి.. దేవదాసు పేరును రికార్డుల్లోకి ఎక్కించారు. భూ రికార్డుల ప్రక్షాళన సమయంలో అప్పటి ప్రభుత్వం కొన్ని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. శివాయి జమేదారులు (అర్హత గలిగిన అనుభవదారుడు)గా ఉన్న వారి నుంచి దరఖాస్తులు వస్తే.. (ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్ (పీవోటీ) చట్టం-1977లోని సెక్షన్ 4 సబ్ సెక్షన్ (1)) ప్రకారం.. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి, నిబంధనల మేరకు ఉంటే, సదరు అనుభవదారుడిని గుర్తించి హక్కులు జారీచేయాలని ఆదేశించింది. ఈ హక్కులను జారీ చేసే ముందు మెమో నంబర్ 24196/ఏఎస్ఎస్ఎన్.1(3)/2017-1 తేదీ:18-12-2017, సీసీఎల్ఏ రెఫరెన్స్ నంబర్ (ఏఎస్ఎస్ఎన్.1(1)/1074/2008 తేదీ: 7-3-2018ను పరిగణనలోకి తీసుకొని రికార్డులను అప్‌డేట్ చేస్తూ హక్కులు కల్పించాలని ఆదేశాలు వచ్చాయి. పై ఆదేశాల ప్రకారం దేవదాసుకు ఆస్తి సక్రమించి.. పట్టాదారు పాసుపుస్తకం జారీకాగా.. ప్రస్తుత తహసీల్దార్ మాత్రం.. అంతా తప్పుడు పద్ధతిలో ఆనాటి అధికారులు దేవదాసుకు హక్కులు కల్పించారని పేర్కొంటూ.. స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. దేవదాసు విషయంలోనూ.. రాజకీయ కక్షే కనిపిస్తున్నది. జిందం దేవదాసు.. సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ కళ భర్త, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణికి సొంత సోదరుడు. జిందం చక్రపాణికి రాజకీయంగా సిరిసిల్లలో మంచి పేరున్నది. చక్రపాణి సతీమణి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఉండటం.. అధికార పార్టీకి మింగుడు పడటం లేదు. దీంతో చక్రపాణిని రాజకీయంగా అణగదొక్కడానికి జిందం దేవదాసుపై అధికార పార్టీ తన అస్త్రం ప్రయోగించిందనే విమర్శలొస్తున్నాయి.

## రాజకీయ కక్షే..?




సురభి నవీన్‌రావు.. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు. గతంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించిన ఆయన.. సర్పంచ్‌గా కూడా పని చేశారు. రాజకీయంగా ప్రజల్లో మంచి పేరున్నది. తంగళ్లపల్లి మండల స్థాయిలోనూ రాజకీయంగా కీలకంగా ఉన్నారు. ప్రజల అభిమానాన్ని పొందుతున్న సదరు నాయకుడిని ఎలాగైనా లొంగదీసుకోవాలన్న ఆలోచనతోనే ఆయనపై కేసు నమోదు చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారనే ప్రచారం జరుగుతున్నది. అయన మాత్రం న్యాయస్థానాన్ని ఆశ్రయించి బెయిల్‌పై బయటకు వచ్చారు. న్యాయ పోరాటం చేయడానికే నిశ్చయించుకున్నారు. మరో కోణంలో చూస్తే.. నిజానికి గత 20 ఏండ్లుగా ఎందరో తహసీల్దార్లు మారారు. కలెక్టర్లు, రెవెన్యూ విభాగంలో పైనుంచి క్షేత్రస్థాయి వరకు చాలామంది అధికారులు వచ్చి వెళ్లారు. గత చరిత్రను చూస్తే.. ఈ స్థలానికి సంబంధించి ఎక్కడా అభ్యంతరాలు వ్యక్తమైన దాఖలాలు లేవు. ఎవరూ ఫిర్యాదు చేసినట్టుగా రికార్డులు లేవు. అధికారులు నోటీసులు ఇచ్చిన దాఖలాలు లేవు. కానీ, ప్రస్తుత తహసీల్దార్ మాత్రం పహనీలో పేరు నమోదు తప్పుగా చేశారని, కాలక్రమేనా పలు సందర్భాల్లో రికార్డులను కొంతమంది అధికారులు తారుమారుచేశారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అదే నిజమైతే, రికార్డులు మార్చిన అధికారులను ముందుగా గుర్తించాలి? ఏ సందర్భంలో మార్చారో వారి నుంచి వివరణ తీసుకోవాలి? ఆ సమయంలో పనిచేసిన అధికారుల వద్ద ఉన్న ఆధారాలేమిటో బయకు తీయాలి. నిజంగా తప్పుడు రికార్డులు సృష్టించారో లేదో ముందుగా తేల్చాలి. తహసీల్దార్ ఫిర్యాదులో పేర్కొన్నట్టుగా రికార్డుల మార్పు జరిగి ఉంటే.. అందులో నవీన్‌రావు పాత్ర ఉన్నదో లేదో తేల్చాలి. కానీ, ఇవేవీ అధికారులు పట్టించుకున్నట్టుగా కనిపించడం లేదు. ఈ వ్యవహారంలో రాజకీయ కక్షే కనిపిస్తున్నది తప్ప.. పారదర్శకత కనిపించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.



యశోద దవాఖానలో సీఎంఈ సిరీస్ కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు

## 'యశోద'లో విజయవంతంగా కొత్త సీఎంఈ సిరీస్

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ హైటెక్ సిటీలోని యశోద దవాఖానలో రేడియేషన్ ఆంకాలజీ విభాగం కొత్త సీఎంఈ సిరీస్‌ను విజయవంతంగా నిర్వహించింది. ఈ సందర్భంగా యశోద హాస్పిటల్స్ గ్రూప్ డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి మాట్లాడుతూ.. గర్భాశయ, ఎండోమెట్రియల్, సర్వైకల్ క్యాన్సర్లకు సంబంధించిన చికిత్సల్లో ఇటీవల సాధించిన పురోగతులపై ఈ కార్యక్రమంలో చర్చించినట్టు తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 350 మంది గైనకాలజిస్టులు, ఆంకాలజిస్టులు హాజరైన ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్స్ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ సునీత ములింటితోపాటు ప్రముఖ వైద్య నిపుణులు ప్రొఫెసర్ శాంత కుమారి, డాక్టర్ సునీత అల్లంకి, డాక్టర్ చిన్నబాబు సుంకపల్లి, డాక్టర్ బెతునే నాయుడు, డాక్టర్ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




# డ్రగ్స్ కిట్స్‌లో డొల్లతనం?

- కిట్స్‌లో పాజిటివ్.. మాన్యువల్‌గా నెగిటివ్!
- ఆందోళన చెందుతున్న బాధితులు
- డ్రగ్స్ టెస్టింగ్ కిట్స్ నాణ్యతపై పలు అనుమానాలు



హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ): తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డ్రగ్స్ టెస్టింగ్ కిట్లపై అనుమానాలు తలెత్తుతున్నాయి. డ్రగ్స్ తీసుకునే వారిని త్వరగా గుర్తించేందుకు అందుబాటులోకి తెచ్చిన కిట్లలో నాణ్యత లోపించిందని పలువురు నిపుణులు చెప్తున్నారు. డ్రగ్స్ తీసుకోకపోయినా 'డ్రగ్ పాజిటివ్' అని రావడంపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. డ్రగ్స్ కిట్లతో నిర్వహిస్తున్న టెస్టుల్లో తప్పుడు ఫలితాలు వస్తున్నాయని బాధితులు గగ్గోలు పెడుతున్నారు. తమకు డ్రగ్స్ అలవాటు లేదని చెప్పినా.. పోలీసులు, ఎక్సైజ్ సిబ్బంది అడ్డంగా కేసు బుక్ చేస్తున్నారని లబోదిబోమంటున్నారు. ఇటీవల హైదరాబాద్ నగరంలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఓ చోట పోలీసులు తనిఖీలు నిర్వహించారు. అనుమానితులను అదుపులోకి తీసుకొని డ్రగ్స్ కిట్స్‌తో మూత్రపరీక్ష నిర్వహించగా ఇద్దరికి పాజిటివ్ వచ్చింది. వారిలో ఓ యువకుడు తనకు మత్తుపదార్థాల అలవాటు లేదని, జ్వరానికి మాత్రలు వేసుకున్నానని చెప్పినా వినలేదు. తీరా అతనికి దవాఖానలో రక్తపరీక్షలు నిర్వహించగా 'నెగిటివ్' అని వచ్చింది. దీంతో పోలీసులు, టీజీ న్యాబ్ అధికారులు కంగుతిన్నారు. ఇలాంటిదే మరో ఘటన హైదరాబాద్‌లో చోటుచేసుకున్నది. న్యూ ఇయర్ సందర్భంగా ఆబ్కారీ పోలీసులు ఓ పబ్‌లో సోదాలు చేపట్టారు. పలువురు అనుమానితులకు డ్రగ్ టెస్టింగ్ కిట్లతో చేసిన పరీక్షల్లో ఐదుగురికి పాజిటివ్ వచ్చింది. అయితే, వారికి సైతం దవాఖానలో నిర్వహించిన రక్తపరీక్షల్లో ఎలాంటి మాదకద్రవ్యాలు తీసుకోలేదంటూ వైద్యులు నిర్ధారించారు. దీంతో ఎక్సైజ్ సిబ్బంది సైతం ఖిన్నులయ్యారు. వరుస పరిణామాలతో ఇన్నాళ్లూ డ్రగ్ టెస్టింగ్ కిట్లతో చేసిన పరీక్షలపై అనుమానాలు తలెత్తుతున్నాయి.

**లోపిస్తున్న కచ్చితత్వం**

గతంలో డ్రగ్స్ తనిఖీల్లో చిక్కిన వారి నుంచి రక్త నమూనాలను సేకరించి పరీక్షించేవారు. ఒక్కో పరీక్షకు రూ.5వేలు ఖర్చయ్యేది. ఇవే పరీక్షలను తేలికగా నిర్వహించేందుకు డ్రగ్ టెస్టింగ్ కిట్లను అందుబాటులోకి తెచ్చారు. వాటిని టీజీ న్యాబ్ ఆధ్వర్యంలో ఆబ్కారీ, హెచ్‌న్యూ పోలీసులు సరఫరా చేస్తుండటంతో వాటినే ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. కేవలం రెండు నిమిషాల్లో వ్యక్తి తీసుకున్న డ్రగ్ ఏంటో ఈ పరికరం సూచిస్తుంది. ఈ డ్రగ్ టెస్టింగ్ కిట్ ద్వారా గంజాయి, కొకైన్, హెరాయిన్, ఎల్ఎస్‌డీ సహా 11 రకాల మత్తు పదార్థాలను గుర్తించే వీలు ఉంటుంది. అనుమానితుల మూత్రం, లాలాజలం నమూనాలు సేకరించి వారు డ్రగ్స్ తీసుకున్నారా? లేదా? అని ఈ కిట్లతో సెకన్లలో తేల్చేస్తున్నారు. అయితే, మొదట్లో 100శాతం కచ్చితత్వం వచ్చిన కిట్స్.. ప్రస్తుతం 70-80 శాతం మాత్రమే ఇస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. జ్వరం, ఒళ్లు నొప్పులు వంటి వాటికి కొన్ని ట్యాబ్లెట్లు వేసుకున్నా కూడా మూత్రపరీక్షలో పాజిటివ్ వస్తుందని సాక్షాత్తూ టీజీన్యాబ్ సిబ్బందే చెబుతున్నారు. కిట్లతో చేసే పరీక్షల్లో భిన్న ఫలితాలు రావడం తలనొప్పిగా మారిందని అంటున్నారు. దీంతో కిట్లతో ప్రాథమిక పరీక్ష నిర్వహించి, అనంతరం పూర్తి నిర్ధారణకు దవాఖానలకు తరలిస్తున్నారు. అక్కడ కూడా నెగిటివ్ వస్తుండటంతో.. ఆశ్చర్యపోవడం పోలీసులవంతవుతున్నది.

